


జగన్, నేనూ కలిసి గ్రాండ్‌ట్రంక్ రోడ్డుమీదుగా నడిచి పెద్దపాదు బాడా మెట్టుమీద కూచున్నాం.

సంధ్యారుణ కాంతులతో నిండిన ఆకాశం విలాసంగా పడుకుని, సన్నగా పొడుగ్గా ఉన్న రోడ్డుని, ఇరుపక్కలా పరుచుకున్న పచ్చటి తివాసీలాంటి పంట చేనుని, విశాలనయనాలతో పరికిస్తోంది.

సన్నని గాలికి కెరటాల్లా ఊగుతోన్న చేను కనుచూపు కందని తీరాలకి పాకుతున్నట్టుగా ఉంది.

జగన్ సిగరెట్టు తీసి వెలిగించాడు.

అతను చెప్పబోయేదేదో ప్రేమకథలాంటిదని తెల్సు.

నాకు అన్నిటికన్నా విసుగెత్తించేది ఇలాంటి కథలే! నే రాసిన ఏ కథలోనూ ఆ కథావస్తువు కనిపించదు.

దానికి కారణం, నే ఏర్పరుచుకున్న కొన్ని అభిప్రాయాలు.

అందమైన వాస్తువుని చూసినప్పుడు మనసు ఆకర్షిత మవుతుంది.

శరీరకావసరాలు వాంఛకి మసిపూసి మారేడుకాయ చేసి గొప్పగొప్ప వాక్యాలు చెప్పిస్తుంది. స్వార్థానికి ముసుగేసి త్యాగాలు చేశానని నమ్మింప చూస్తుంది.

ఒక గుడ్డిపిల్లని, అనాకారిని ప్రేమించిన కథానాయకుడు హృదయాన్ని సాక్షిగా తీసుకొస్తే ఆ ప్రేమకథని స్వీకరించటానికి నాకు అభ్యంతరం లేదు.

'ఆ అమ్మాయి నడుం పిడికిటంత ఉంటుంది. కళ్ళు కలువరేకుల్లా ఉంటాయ్. వక్షోజాలు ఉన్నతంగా ఉంటాయ్. పిరుదులు ప్రబంధనాయకి మల్లె విరిగి పోయుంటాయ్' అని జగన్ నాకు చెప్పడు.

చెప్పకపోయినా, ఇలాంటి విషయాలు తోటుకి పోయి చదవటం కరతలామలకం నాకు.

'చూడు మూర్తి! నన్ను ఉచ్ఛు అను, రోషి అను, లేదా గొప్పవాడను. ఏదనుకున్నా నాకు ఇబ్బందిలేదు. ఇది నిజమైన కథ. దీన్ని ఇంకాస్త రంగులు పూసి తయారు చెయ్యటం నీపని' అన్నాడు. జగన్.

'హుఁ!' అని, ఒక నవ్వు నవ్వేను: ఎందుకో నానవ్వు వికారంగా ఉంటుందని

నాకు అనుమానం.

'సరే! ఇంక కథచెప్పు. మధ్యలో 'ఊఁ' కొట్టను. టేప్‌రికార్డర్‌లా మెదడు సెట్ చేశాను' అన్నాను.

జగన్ చెప్పటం మొదలుపెట్టాడు...

లెక్కలక్లాసు ఎప్పుడున్నా, ఆ ముందు రోజు సాయంత్రం నాలుగు లెక్కలు ప్రిపేర్ అవటం నాకు అలవాటు.

ఆ రోజున ఏదో ప్రాబ్లమ్ సాల్వ్ చేస్తున్నాను. సంధ్యాసమయం. ఈజీచెయిర్‌లో డాబామీద కూచున్నాను. లెక్క చేస్తూ, మనసులో గుణిస్తూ చేతులు తిప్పటం అలవాటు నాకు.

గిరుక్కున వెనక్కి తిరిగి మొహం చిట్లించుకుని విసవిసా వెళ్ళిపోయింది ఎదురింటి అమ్మాయి.

ఎదురుగుండా డాబా మీద ఒక అమ్మాయి నిల్చుందని గమనించలేదు నేను. ఆమె ఎలా ఉంటుందోకూడా తెలీదు నాకు. కాని ఆ నడకలో తమాషా అయిన సొగసు కనిపించింది. పొడుగాటి వాల్జడ విసురులో, బోలెడంత టెక్కు కనిపించింది. పుష్టిగా, నిండుగా, పొగరుగా ఉన్న విగ్రహం ఒక్క లిప్తకాలంలో మాయమయ్యింది.

నా చేతులు తిప్పటం ఆమె తప్పుగా అర్థం చేసుకుని ఉండొచ్చు. 'సరే, అదేదో నిర్ధారణచేద్దాం', అనుకున్నాను.

మరుసటి రోజు రోజంతా నా కళ్ళు ఆమెకోసం వెదికాయ్.

మూడోరోజు సాయంత్రం అదే చోటులో మళ్ళీ కనిపించింది.

నాకేసి తిరిగినప్పుడు నిజంగానే చెయ్యి వూపాను. గబగబా డాబా దిగి పోయింది.

ఆ సంగతి, అంతటితో మర్చిపోయాను. కాలేజీలో చదివేటప్పుడు ఇలాంటి కోతిపన్లు ఎన్నో చేశాను. స్కూల్‌మేష్టరుగా జాయినయి ఏడాది దాటలేదింకా. దేన్నీ సీరియస్‌గా తీసుకునే నైజంకాదు నాది.

కాని ఆమెకు నా ప్రవర్తన, నామీద ఏవగింపుతో పాటు కుతూహలాన్నికూడా పెంచిందని నాకు తెలీదు.

అదీ కాకుండా కుర్రజగన్ మేష్టారు మంచివాడని ఆ వీధిలో పెద్దవాళ్ళందరిలో, ఒక నమ్మకం ప్రచారంలో ఉంది.

ఆమెకు కోపాన్ని కలిగించిన సంఘటన నాకు అర్థమైంది. కాని, ఈ మంచి కుర్రాడి వింతప్రవర్తన ఆమెకు అర్థం కాలేదు.

సాంబశివం, నే పనిచేసే స్కూల్లోనే టీచరు. నాకు కాస్త డబ్బు ఇబ్బంది కలిగినప్పుడు నాలుగు ట్యూషన్స్ చూపించింది అతనే. చాలా సరదాగా మాట్లాడే మనిషి, స్నేహపాత్రుడు అనిపించినమనిషి స్కూల్లో అతనొక్కడే. అందువల్ల అతని పరిచయం చాలా త్వరలోనే మంచి మైత్రిని దృఢపరిచింది.

ఒకరోజు నా రూమ్‌కి వొచ్చినప్పుడు, ఈ విషయం చెప్పి, ఆ అమ్మాయిని చూపించాను. ఆ అమ్మాయి వివరాలు ఇంకొన్ని సేకరించి, నాకు చెప్పాడు. ఆ అమ్మాయి చెల్లెలికి క్లాస్ టీచర్‌కూడా సాంబశివమే.

'వాళ్ళ బాబు పోలీస్ ఆఫీసరోయ్ నాయనా! వెర్రివేషాలెయ్యకు. జాగ్రత్తగా ఉండు' అన్నాడు. సాంబశివం ఆ పిల్ల వివరాలు చెబుతూను.

'పోలీసాఫీసరయింది, గవర్నర్ జనరలైంది, వొదిలిపెట్టు. ఎవడూ మనదగ్గరకు రాలేదు. అయినా వాళ్ళ బాబుకన్నా ఆ అమ్మాయికే పోలీస్ ఆఫీసరు లక్షణాలెక్కువ ఉన్నాయ్‌రోయ్' అన్నాను, ఆ అమ్మాయి నడక గుర్తు తెచ్చుకుంటూ.

నా విట్టుకి సాంబశివం నవ్వలేదు. మొహం సీరియస్‌గా పెట్టి, 'అనవసరమైన విషయాల్లోకి తలదూర్చి ఆరోగ్యం పాడుచేసుకోకు బాబ్జీ! ఆ అమ్మాయి నిన్ను 'లవ్' చేస్తుందనికూడా ఆశపడకు. నీకన్నా పెద్దవాణ్ణి కాపోయినా, నీమేలు కోరినవాణ్ణి' అని ఇంకో బోడివిట్టు పేల్చాడు నామీద.

సాంబశివం జోకు నవ్వు తెప్పించేది కాదు. సాంబశివంతో నాకు ఏర్పడ్డ స్నేహం, అతను నన్ను తేలిగ్గా హేళన పర్చేదికాదు. కాదు—ఇది నా వ్యక్తిత్వానికి సవాలు అనుకున్నాను.

'సరే సాంబశివం. ఆ అమ్మాయి దగ్గర్నించీ ఉత్తరాన్ని తీసుకొచ్చి ఆమెకు నామీద అభిప్రాయం ఉందని ధృవపరిస్తే ఏమంటావ్?' అన్నాను.

సాంబశివం బహులుగా నవ్వేశాడు: నేనా పని చెయ్యలేనని అతని నమ్మకం.

నేను ఆవేళ అనాలోచితంగా చెయ్యి వూపటం ఆమెకి ముప్పు తెచ్చిపెట్టింది. ఒక అపరిచితుడు అలాంటి పనిచేసినప్పుడు, నైతికంగా ఆ మనిషి చాలా చెడిపోయినవాడై ఉండాలి.

ఆ అభిప్రాయం గట్టిపర్చుకోటానికి ఆమె నన్ను జాగ్రత్తగా గమనిస్తూ వొచ్చింది. స్కూలుకి వెళ్ళేప్పుడూ, వొచ్చేప్పుడూ, సెలవురోజుల్లో డాబామీద తిరిగినప్పుడూ, ఆమె దృష్టి నామీద ఉండటం గ్రహించాను.

చాలా జాగ్రత్తగా ఆలోచించినమీదట, ఆ కుతూహలం కేవలం ఒక మనిషి నైజాన్ని గుర్తుపట్టటానికి కాదని, ఇంకా బలమైన సహజమైన ఆకర్షణకు ఆమెకు తెలీకుండానే ప్రభావితురాలవుతూందని తెలుసుకున్నాను.

ఆడవాళ్ళు శరీరకంగా, ఇమోషనల్‌గా పెరిగినంత త్వరగా ఇంటలెక్చువల్‌గా పెరగరు.

అందువల్లే వాళ్ళు మగాడికి లొంగిపోయేది.

కల్యాణితో మాట్లాడే అవకాశం నాకు చిక్కలేదు. కాని చాలా త్వరలోనే కళ్ళతో మాట్లాడ్డం ఆమె తెల్సుకుంది. సైకిల్‌మీద స్కూలుకి వెళ్ళేటప్పుడు వరండామీద నిల్చుని నవ్వేది.

స్నేహితులతో మాటాడుతూ వెళ్తూ ఆమెకి వినబడేలా రెండు అర్థాలు స్ఫురించేలా ఆమె అందానికి కాంప్లిమెంట్స్ విసిరేవాణ్ణి.

నిజం చెప్పాలంటే కల్యాణి అందానికి అది సరిపోదు. ఆమె కాటుక కళ్ళను చేపల్తోనూ, ఆలుచిప్పల్తోనూ పోల్చటం నేరం అవుతుంది. ఆమె నాసికను సంపెంగతోనూ, చిన్నినోరు సున్నాతోనూ పోల్చటం ఒక పిచ్చివాడిపని.

ఆమె సౌష్టవమైన దేహాన్ని చూసినప్పుడు, పాపపు ఆలోచనలగాలి సోకినప్పుడు ఒకటి రెండుక్షణాలు నా శరీరం వణకటం నిజం.

నాక్కావల్సింది చిన్న ఉత్తరం. ఆ తర్వాత, ఆమెకు నా ప్రమేయం ఉండదు. అంతవరకూ వ్యవహారం సజావుగానే

ఉంది. విశ్వాసం ఇక ఎంతదూరమో లేదు.

హాస్టల్లో సాంబశివాన్ని పిల్చి చెప్పాను.

'ఇంక, ఎంతో దూరం లేదు. రెండు రోజుల్లో నా మాట నిలబెట్టుకుంటాను' అన్నాను.

సాంబశివానికి నేనన్నదేమిటో సరిగ్గా తెలీలేదు. అంతవరకూ నే నడిచిన తిప్పలు, ఆ అమ్మాయిని దారికి తీసుకొచ్చిన వైనం అంతా చెప్పాను.

సాంబశివం నమ్మినట్టు కనిపించలేదు.

'సరే చూద్దాం' అన్నాడు.

మర్నాడు అతనికి నేను చూపించిన చిన్న ఉత్తరం చూసి నివ్వెరపోయాడు.

డియర్...

నిన్న రాలేకపోయినందుకు క్షమించండి. మ్యాట్నీకయితే రావటానికి వీలుగా ఉంటుంది.

ఆదివారం మూడుగంటలకి వీరభద్రా టాకీస్‌దగ్గర ఎదురుచూస్తూ ఉండండి.

క.

పరీక్షలో నెగ్గినంత సంతోషం కలిగింది నాకు.

సాంబశివం, ఓటమిని చాలా స్పోర్టివ్‌గా తీసుకున్నాడు.

ఎందుకంటే ఇందులో అతనికి పోయిం దేమీలేదు గనుక.

పార్టీ ఇచ్చి, 'విష్‌యూ గుడ్‌లక్' అన్నాడు.

'ఏడిశావ్ నాకు అలాంటి ఉద్దేశం లేదు' అని కొట్టిపారేసినా ఎందుకో మనసులో దిగులేసింది.

ఇదంతా తమాషాకి చేసేనని చెప్పనా? లేక, మేం పందెం వేసుకున్నాం, నిన్ను ఈ ఆట ఆడించానని చెప్పనా? లేక, చెంపలేసుకుని క్షమించమని అడగనా?

ఏం పాలుపోలేదు. చెప్పిన టైమ్‌కి సినిమా హాలుగేటు దగ్గర కాపలా కాసేను?

కల్యాణి చెప్పిన సమయానికి సరిగ్గా వచ్చింది. టిక్కెట్లు ముందే తీసుకున్నాను. హాల్లో దూరేక, తెలిసినవాళ్లు ఎవరూ లేక పోవడం మూలాన ప్రాణం తెరిపిన పడింది.

నాకోసం భయం లేదు. ఆ అమ్మాయి తెగింపుకి ఆశ్చర్యం కలిగింది. ఎవరయినా చూస్తే ఆమె జీవితం దెబ్బతినే పరిస్థితి.

కల్యాణి నేనూ అట్టే మాటాడుకోలేదు. బాక్స్‌లో మా చుట్టూ మనుషులు కూడా ఎవరూలేరు. మిసమిసలాడే యవ్వనం. మనిషిని రెచ్చగొట్టి చిత్తు చేసే సౌందర్యం. తెగించి చేతవేసిన పిల్ల. కాని నేను చొరవ తీసుకోలేదు.

సినిమాహాల్లో లైట్లు వెయ్యకపోతే ఒక పడుచుపిల్ల సాంగత్యం చాలా సునాయాసంగా దొరుకుతుంది. ఆమెను ప్రేమిస్తున్నాననుకుని నన్ను నేను మభ్య పెట్టదల్చుకోలేదు. ఆ అభిప్రాయం తొలగించుకోవానికి స్క్రీన్‌మీదకి దృష్టి మరల్చాను. సాధ్యపడలేదు.

'కల్యాణీ నేనంటే నీకు ఇష్టమేనా?' అని అడిగాను, విడిపోయేముందు—

'అది పిచ్చిప్రశ్న. ఇంట్లో వాళ్లందర్నీ మోసంచేసి ఇలా వచ్చేదాన్ని కాదు' అంది.

ఇలా చాలా సినిమాలు చూశాం. చాలా జాగ్రత్తగా కలుసుకునేవాళ్లం. అంత వరకూ, తెలిసినవాళ్లకంట పడక పోవటం అదృష్టం.

దొడ్డితోవన తలుపు తీసిఉంచినప్పుడు అర్ధరాత్రి దొంగలా వాళ్ల ఇంట్లోకి దూరేవాణ్ని. కల్యాణి తండ్రి, తల్లి, చెల్లెలు మంచినిద్రలో ఉండేవాళ్లు.

పువ్వుపువ్వులాంటి వెన్నెల్లో, కొబ్బరి చెట్టుకింద కల్యాణిని మొదటిసారిగా ముద్దు పెట్టుకున్నాను. మగాడిగా నాకు అది మొదటి అనుభవం. కల్యాణి నాకేసి చూడ్డానికి సిగ్గుపడింది. తీయని అనుభవం తీగలాసాగి, అణువణువులో కోటి కల విద్యుత్తుని ప్రవహింపచేసింది. మోహాన్ని రగిల్చి, ఉన్మత్తుణ్ణి చేసే స్పర్శ కల్యాణిని నాదానిగా చేసింది.


సాంబశివం మర్నాడు హాస్టల్లో కలిసినప్పుడు ఏమీ దాచకుండా చెప్పాను. ఎంతటి రహస్యమయినా సరే అది ఇచ్చిన అనుభూతి మనిషిని కుదిపేసినప్పుడు సాంబశివంలాంటి ఆప్తమిత్రుడికి తెలియనివ్వటంలో నాకు తప్పు కనిపించలేదు.

సాంబశివం ముందే ఊహించినట్టుగా నాకు తెలుసు అన్నట్టుగా నవ్వి, 'భాయ్! కౌగిలి ముద్దులతోనూ, కళ్ల సైగలతోనూ ఆగిపోయేది కాదు—ప్రణయానికి ఇది రెండో మెట్టు' అని, ఆగేడు.

నాకు తెలియకుండానే ఇలా చాలా రోజులు గడిచిపోయాయ్.

కల్యాణిని చూడకపోతే మనసు నిలిచేది కాదు. ఒక్కోసారి అర్ధరాత్రి గోడ గెంతాల్సి వచ్చినప్పుడు, కాళ్లూచేతులు విరిగినంతపని కూడా అయింది.

రాత్రి చాలా త్వరగా తెల్లారిపోయేది; పగలు సాయంత్రంపూట నీడలా పొడుగయి



[illegible]:

తిన్నగా పాఠాలు చెప్పటం మానేసాను. పరీక్ష రోజుల్లో పిల్లలు' గోలపెట్టే వాళ్ళు.'

సాంబశివంకి 'కళ్యాణి విషయం చెప్పటం మానేశాను. ఏదో అశాంతి మనసును దొల్చటం మొదలయింది.

'ఏం జగన్ — కళ్యాణి మత్తుమందు పెట్టేసిందా? నాతో మాట్లాడ్డం కూడా మానేశావ్' అనేవాడు సాంబశివం. ఆ విషయం తప్పించి ఇంకో తోవలోకి సంభాషణ మార్చేవాణ్ణి.

ఒక మగాడు, ఆడది అంత చేరువుగా ఉన్నప్పుడు స్వీట్ నథింగ్స్ తప్ప వేరే విషయాలేముంటాయ్ మాట్లాడ్డానికి? చందమామ రోజురోజుకి కళలు పెంచుకుని వికసిస్తాడు. నక్షత్రాలు ఇంకా కాంతివంతంగా కనిపిస్తాయ్.

అరోజు మాటల సందర్భంలో చెప్పింది.

'నాన్నగారు ఏదో సంబంధం తీసుకొచ్చారు. యక్షప్రశ్నలువేసి నన్ను సెలక్టు చేశాడు అబ్బాయి. నా కిష్టంలేదని నాన్నగారితో చెప్పేశాను' అంది.

'ఏం? అబ్బాయి బాగాలేడా?' అన్నాను.

'అది నా కనవసరం' అంది.

'కళ్యాణి! నా పెళ్ళి నిశ్చయం అయిపోయింది' అన్నాను తమాషాకి. నిజంగనే

# వల

ఇంటినుంచి ఉత్తరాలు శరపరంపరలుగా వస్తున్నాయ్.

'మంచిదే! సంతోషం' అంది.

'ఎవరితోనో అడగవేం?' అన్నాను.

'నా కనవసరం' అంది.

ఆ పిల్లగుండె నిబ్బరానికి ఆశ్చర్యపోయాను.

'నిజం చెబుతున్నాను. నేను బ్రాహ్మణ్ణి. నువ్వు తెలగాపిల్లవి. మానాన్న మావాళ్లలోన ఎవర్నో చూశాడు. బహుశా ఆయన మాటకి నేను ఎదురు చెప్పలేక పోవచ్చు' అన్నాను.

'నాకేం నష్టం?' అని ఎదురు ప్రశ్న వేసింది.

'నువ్విలా పెళ్లికొడుకుల్ని తిరక్కొట్టేంతకాలం, మాసంగతి బయటపడి నేను నిన్ను వదిలేస్తే, నీ సంగతి ఊహించు.' అన్నాను.

'ఈ దెబ్బతో కంట నీరు పెట్టుకుంటుంది అనుకున్నాను మనస్సులో —

కళ్యాణి లొంకలేదు. క్షణంసేపు ఆలోచించింది.

'నన్ను చేసుకుంటే నిజంగా నే మిమ్మల్ని వెలేస్తారా?' అంది.

'అందర్నీ నేనే వెలెయ్యాలి.' అన్నాను.

కళ్యాణి చేసినపని నాకు నచ్చలేదు. నేను

ఆమె జీవితంతో చెలగాటమాడినా ఆమె పూర్తిగా మోసగింపబడటం నాకు ఇష్టం లేదు.

రూమ్ కొచ్చాక చాలా ఆలోచించాను. కళ్యాణిని చేసుకోటానికి నేను సిద్ధంగా లేను. ఆమెతో స్నేహం చేసింది పెళ్లి చేసుకోటంకోసం కాదు. నాకు ముందు నుంచీ అలాంటి అభిప్రాయం లేదు.

రెండురోజులు ఆమెను తప్పించుకు తిరిగాను, పదే పదే ఆమె కళ్లముందు కదలాడింది. గుండెల్లో బాధ — దుస్సహమైన వేదన.

నిజానికి ఆమెనుంచి - నేను ఆశించాల్సింది లేదు. శరీరకంగా ఆమె నాలో వ్యామోహాన్ని రెచ్చగొట్టే ఆకర్షణ లేదు. మునుపటిలా అనుభవం కోసం పడే తపనా నాలో లేదు. అది నగ్నసత్యం.

కాని, కళ్యాణి ఆకర్షణ సూదంటురాయిలా నన్ను లాగుతోనే ఉంది. నా స్వార్థం అనే కేంద్రంనుంచి పట్టుజారి నిస్సహాయంగా ఆమె చుట్టూ తిరుగుతున్నాను.


మూడోరోజు కళ్యాణి దగ్గరకు వెళ్ళాను. ఆమెను తాకకుండా కూర్చుని కబుర్లు చెప్పటం మొదలు పెట్టాను. ఆమె కళ్లల్లో ఎంతటి అభిమానం నిండి ఉందని! — ఆమె మనసులో ఎంత గొప్ప స్థానం నాకు ఇవ్వబడిందని!

కళ్యాణి రెండు రాత్రులు తలుపు తెరిచి నా కోసం చూస్తూనే ఉంది. నిద్రలేని మొహం, తిండి తినని మొహం — బాలెంతరాలులా, కొడుకుని చూసిన తల్లి పొందే ఆనందంతో వికసించింది.

నాలుగైదారేడు రోజులు దాటాయ్. నెల గడిచింది. ఇంకో రెండుమూడు — నిమిషాల్లో గడిచాయ్. కళ్యాణి సాన్నిధ్యంలో గడిపిన ప్రతిక్షణం విలువైంది. ఆమెను తాకకుండా మాత్రం జాగ్రత్త పడేవాణ్ణి.

నేను వాంఛించేది కళ్యాణి అందం గాని, యవ్వనంగాని కాదని రుజువై పోయింది. కేవలం ఆమె సామీప్యం బ్రతుక్కొక అర్థాన్ని తెలుపుతుంది.

అయితే నే కోరేది కళ్యాణి మనసునా? ప్రేమాభిమానాలు గుప్పించి లోబర్చుకున్న కళ్యాణినా? నా లాభికను అందని



ఏ బంధం పెనవేస్తోంది ? ఆమెను కోరి వప్పుడు ఆమెకోసం ఎందుకు వెంపర్లాడుతున్నాను.

'ప్రేమ' అనే మాట మీద నాకు నమ్మకం తక్కువ. నేను దానికి ప్రేమ అని నామకరణం చెయ్యటానికి ఉత్సహించను.

సాంబశివం రోజూ వచ్చి పిచ్చాపాటీ వేసి వెళ్ళిపోతున్నాడు. స్కూల్లో రొటీన్ వర్కు ఎప్పట్లా సాగుతోంది. టైమ్ గడవటానికి ట్యూషన్లు ఎక్కువచేసి మనసులో ఆలోచనల స్రవంతికి ఆనకట్ట కట్టే వృధా పరిశ్రమ పడుతున్నాను.

ఆ రోజురాత్రి నా గుండెల్లో గూడు కట్టుకున్న భయం నిండుగా మారింది. కళ్యాణిమాత్రం నిశ్చలంగా ఉంది. ప్రశాంతమయిన సరోవరంలా, కడిగిన మంచి ముత్యంలా, ప్రఫుల్లవదనం అలరారుతోంది. ముంగురులు కపోలాల మీదకి జారి వింతసోయగాన్ని అందిస్తున్నాయ్.

'కళ్యాణీ మై స్వీట్' అని ఉద్రేకంతో ముద్దుపెట్టుకున్నాను. ఆ పరిస్థితి, వాస్తవానికి భయం కలిగించేదయినా, కళ్యాణి భార్యస్థానంలో ఉంటే ఎంతటి ఆనందాన్ని కలిగించేవార్దు !

కళ్యాణి మా వలపుకి ప్రతీకగా బాబునో, పాపాయినో అందివ్వబోతోంది.


ఇక, ఈ నాటకానికి తెర దించెయ్యాలి. సుఖాంతం చెయ్యాలి. కళ్యాణితో వెంటనే వివాహం చేసుకోటం తప్ప గత్యంతరం లేదు అనుకున్నాను.

కళ్యాణి తండ్రితో విషయం నేరుగా చెప్పాలి. పోలీసాఫీసర్ కళ్ళుకప్పి ప్రేమాయణం నడిపినందుకు గన్‌గ్రటా పెట్టుకొచ్చి గుండెని పేల్చలేడు. మండి పడ్డా ఒప్పుకోక తప్పదు.

కళ్యాణి వీధి గుమ్మంగుండా వెళ్ళి డ్రాయింగ్ రూములో కూర్చున్నాను. కళ్యాణి చెల్లెలు రాణి వొచ్చి వాళ్ళ నాన్నగారు లేరని చెప్పింది. వాళ్ళ అమ్మగారు వొచ్చి చూసి వెళ్ళిపోయారు.

వెనక్కి తిరిగొస్తుంటే సాంబశివం కనిపించాడు. ఆతనికి ఈ విషయం రూమ్‌కి వెళ్ళి చెబ్దా మనుకున్నాను.

'ఏంకథ ?' అన్నాడు, నన్ను చూడగానే! 'రూమ్‌కి రా, చెబుతాను' అన్నాను.

తుంగభద్ర ఇండస్ట్రీస్ లిమిటెడ్; కర్నూలు. ASP-TIL-N-30 TEL

'రేపు ట్యూషన్ అయ్యాక వస్తాను. దానికి మార్కులు రావటం లేదని హెడ్మాస్టరుగారు ట్యూషన్‌కి పురమాయించారు. క్వార్టర్లీ అయితేగాని మానవద్దట.' అన్నాడు.

'ఇవాళ్టికి మానెయ్. నీతో కొంచెం మాట్లాడాలి.' అన్నాను.

'ఇది రెండోరోజు - మానేస్తే హాజరు పాడు అయిపోతుంది. మేష్టారికి నామీద నమ్మకంకూడా పోతుంది' అన్నాడు.

నేను కాస్త ఇబ్బందిగా చూసేసరికి, 'సరే! అరగంటలో వస్తాను. ఉండు' అన్నాడు.

సాంబశివం కోసం చూస్తూ కూచున్నాను. చాలా పెద్దసమస్య నెత్తిన వేసుకోవాల్సి వచ్చింది. సంగతి తెలిస్తే నాన్న గడప తొక్కనివ్వరు.

కాఫీ పెట్టుకు తాగి డాబామీదికెళ్ళి వాలుకుర్చీలో కూచున్నాను.

సూర్యుడు పశ్చిమాద్రికి దిగిపోయినా వెలుతురు చెరగనివ్వకుండా విశ్వప్రయత్నం చేస్తున్నాడు. సంధ్య చీకటిని వెంటబెట్టుకుని వస్తోంది. వీధిలాంతర్లు వెలుగుతున్నాయ్. చుక్కలు ఒక్కటొక్కటిగా మెరుస్తున్నాయ్. అరుణిమ ఆకరి చీరలా ఆకాశం కంటితో అంతరించిపోతోంది.

మనసులో ఎన్నో భయాలూ, సందేహాలూ—'అందర్నీ కాదని కళ్యాణిని చేసుకుని సుఖపడగలనా' అన్న ప్రశ్నకి సరైన సమాధానం దొరకటం లేదు. కాని ఇప్పుడు, కళ్యాణికి అన్యాయం చెయ్యలేను.

బుర్ర వేడెక్కిపోయింది. అరగంట దాటిపోయింది. సాంబశివాన్ని పిల్చి నోరారా దొడ్డున తిరగేస్తేగాని కాస్త ప్రశాంతత చిక్కేట్టులేదు.

రూమ్‌కి తాళంవేసి కళ్యాణి ఇంటికి బయల్దేరాను.

గుమ్మందాటి లోపలి వరండాలోకి అడుగుపెట్టాను. ఫ్లోరసెంట్ లైట్ వెలుగులో ముగ్గురు కూచున్నారు. సాంబశివం గట్టిగా నవ్వుతున్నాడు. సాంబశివం ట్యూషను చెప్పటం లేదు. పేకాట ఆడుతున్నాడు. పదమూడేళ్ళ నిండని పిల్లదాని, దీర్ఘాలోచనలో ఉండి పేకముక్కను ఎత్తుకుంటున్న కళ్యాణి, వాళ్ళిద్దరితో ఆడుతోన్న సాంబశివం.

# వల

ఎంత మేష్టరయితే అవొచ్చుగాక, చనువుండొచ్చుగాక, వయసుకొచ్చిన పిల్లలతో ఇల్లాగ్గా పేకాట ఆడుతున్నాడంటే ఆశ్చర్యం కలిగింది.

టేబుల్‌మీద కాఫీకప్పులు, పుస్తకాలు పడి ఉన్నాయి. అడుగు ముందుకి పడలేదు.

ఇంతలో పేకముక్క ఎత్తుకుని, తెంపి కటి పడేసి 'కళ్యాణీ! ఆ టక్కు డైమాన్‌రాణి గెలిపించింది' అని పెద్దగా నవ్వుతూ సాంబశివం కళ్యాణి భుజంమీద చేసో కొట్టాడు. అతని అర్థంలేని నవ్వులో ఏదో ప్రతిధ్వనిస్తోంది.

నాకు తల తిరిగిపోయింది. విద్యుద్ఘాతం తగిలినట్టుగా అయింది. రక్తప్రసారం ఆగిపోయింది. గిరుక్కున వెనక్కి తిరిగి వస్తోంటే కళ్యాణి తల్లి ఎదురయింది. పట్టుచీరలో, పళ్ళు పువ్వులు పట్టుకుని శివాలయంలోంచి గాబోలు వస్తోంది.

తిన్నగా రూమ్‌కొచ్చి మంచంమీద కూలబడ్డాను.

ఎంత దగా—ఎంతమోసం—ఎంతకుట్ర.

కళ్యాణి కళ్యాణికాదు. లేడి—కాదు, డైమాన్ రాణి.

సాంబశివంగాడు స్నేహితుడు కాదు. పయోముఖ విషకుంభం.

దానికి ట్యూషన్‌కు కుదిరినట్టుగాని, కళ్యాణితో మాట్లాడినట్టుగాని నాకు తెలీకుండా ఎంత జాగ్రత్తపడ్డాడు!

ఎంత పని లేకపోతే ఆమె ఇంటిమీద చెయ్యివెయ్యగలడు!

ఇంకో అరగంట తర్వాత సాంబశివం వచ్చాడు.

'గోదావొడ్డుకి పద' అన్నాను.

మనస్సులో కోపం ప్రజ్వరిల్లుతోంది. ఏటిఒడ్డుసగాలి చల్లదనాన్ని ఇవ్వటం లేదు. శరీరాన్ని కుతకుత ఉడికిస్తోంది.

అంతవరకూ కళ్యాణితో ఉన్న సంబంధాన్ని ఏదీ నేను దాచిపెట్టలేదు సాంబశివానికి.

కళ్యాణి విషయం తనంతట తానుగా బయటపడాలి. సాంబశివం ఆ విషయం తప్పించి లోకంలో జరిగే విషయాలన్నీ తనవేగా మాట్లాడుతున్నాడు.

ఏటొడ్డున నిడకత్వాన్ని చొక్కానిప్పి ఇంటికి వంపెయ్యగలను, లేదా ఇంకో స్నేహితునిచేత ఉదికొచ్చి చెంపలు వాయించగలను.

కాని కళ్యాణికూడా నా దగ్గర దాస్తోంది. పచ్చిబూతుగా మెలుగుతోంది.

మోసానికి మోసం—సాంభశివంచేత నిజం కక్కించటానికి ముందు నాదగ్గర ప్లానుంది.

'నీకు ఒకవిషయం చెప్తున్నా సాంబశివం, గుర్తుందా?' అన్నాను.

'అవునవునుకదూ—రూమ్‌కి అందుకేసి వచ్చింది. నేనే అడుగుదామను కున్నాను' అన్నాడు.

'కళ్యాణితో సంబంధాన్ని తెంచేసు కుందామను కుంటున్నానోయ్—ఇద్దు లేకుండా స్వార్థాన్ని చూపించింది. ఇప్పటికీ ఆ అనుభవం చాలు! బయటపడితే మొదటికే మోసం వస్తుంది' అన్నాను.

సాంబశివం మాట్లాడలేదు.

'ఏమంటావ్?' అని రెట్టించాను.

'ఇది నీ వ్యక్తిగతమైన విషయం అయినా అడిగేవు కాబట్టి చెబుతున్నాను. ఈ పరిస్థితిలో వదిలెయ్యటం మంచిది కాదు' అన్నాడు.

'ఏడిశావ్!— మాసిన ప్రతిదాన్నీ మెళ్ళో కట్టుకోవాలని ఎక్కడేడిసింది?— ఇవాళ నేను. నేనుపోతే ఇంకో తలమాసిన వెధవ. అయినా, జీవితంలో అంత సుకుమారంగా, అంత బిగువుగా ఒంపులున్న ఆడదాన్ని చూట్టం కష్టం' అన్నాను పరీక్షగా చూస్తూ—సాంబశివం ముఖంలో రంగులు మారేయి. ఏదో చెప్పబోయి ఆగిపోయినట్టుగా కనిపించాడు.

ఆ రాత్రి కళ్యాణి దగ్గరకు వెళ్ళాను. నా కోసం ఎదురు చూస్తోంది. 'హా! ఆడది ఎంతజాణ' అనుకున్నాను.

కళ్యాణిలో బెదురులేదు. మోసం చేస్తున్న కళ గుర్తుపట్టటం నా తరం కాలేదు. గుచ్చిగుచ్చి చూస్తున్న నా చూపులు కంగారు పెట్టలేదు. ఆశ్చర్యం కలిగించి ఉండొచ్చు.

కళ్ళల్లో అదే ప్రేమ. పతివ్రత అనేది వుంటే, కట్టుకున్న మొగాణ్ణి అంత

కంటె ఆరాధనతో, ప్రేమతో చూడటం కష్టం.

మాటల్లోదింపి సాంబశివం ప్రసక్తి తెచ్చాను.

'రాణి ప్రైవేట్ మేస్టారా?' అంది. అంతకుమించి సంభాషణ పొడిగించే చేవ కల్యాణి ఎదురుగా నాకు లేదు.

మనసులో, 'ఈమె నాబిడ్డకి తల్లి, ఇంకో ప్రియుణ్ణి వెతుక్కుంటోన్న నయవంచకి' అనుకున్నాను.

'అమ్మకి అనుమానంగా ఉంది. ఇంక దాచిపెట్టటం కష్టం. ఏంచేద్దాం?' అంది.

'ఇప్పట్లో పెళ్ళి అసాధ్యం కల్యాణి! ఇద్దరం బైటపడకుండా ఉండాలంటే ఒకటేమార్గం... ...పోనీ... కూడదూ?' అన్నాను.

కల్యాణి కళ్ళల్లో అదే ప్రశాంతి. కళ్ళల్లోంచి రెండు నీటిబొట్లు కిందకి జారాయి.

'ఏం?...భయమా కల్యాణి?' అన్నాను. లేదని తలూపింది.

మర్నాడు నాకు తెలిసిన డాక్టర్ దగ్గిరికి తీసికెళ్ళాను.

'జీవితంలో ఇవి టిపిగుర్తులు. కల్యాణికీ, నాకూ కూడా ఇది ఘోరమైన క్షణం — ఏ రకంగా, నాకసి తీరటానికి ఇది మార్గం...' అని కూడా అనుకున్నాను.

కల్యాణి మనిషికాదు. రాక్షసి. ఎంతటి బాధనైనా చిరునవ్వుతో భరిస్తుంది. ఎంతటి మగాణ్ణయినా చిరునవ్వుతో గొంతుక కోస్తుంది.

నెలరోజులు కల్యాణిని చూడకుండా ఉండిపోయాను.

అది జరిగాక, కల్యాణితో పూర్తిగా తెంచుకుని చేతులు కడుక్కుని బయట పడొచ్చు నేను. కల్యాణి లేకుండా బ్రతకలేను. ఎంత నిగ్రహించుకుందామనుకున్నా అలోచనలు ఆమె దగ్గిరకు పోయేవి.

సాంబశివంతో నవ్వుమొహం పెట్టుకుని మాటాడేవాణ్ణి. డాబామీదికి తీసుకొచ్చి, కూచోపెట్టి, కల్యాణి ఎదురుడాబామీద ఉన్నప్పుడు ఇద్దర్నీ పరిశీలించేవాణ్ణి.

నాకు నిజం కావాలి. వాళ్ళిద్దరి మధ్యా వున్న రహస్యంతో నా జీవితం ముడిపడి వుంది. కల్యాణిని విడిచిపెట్టి బ్రతకటం ఎంత కష్టమో, చేసుకున్నాక సాంబశివం ఎదురు పడ్డప్పుడు, నే చూసిన దృశ్యం గుర్తుకొచ్చినప్పుడు, నే పడే నరకయాతనను భరించటం అంతకష్టం.

ఆమె విసిరిన ప్రేమ అనే ఇంద్రజాలం నన్ను ఉచ్చులో బిగించింది. కంటికి నిద్రలేదు—మనసులో ద్వేషం—ఆమె పట్ల తెంచుకోలేని ప్రేమ.

ఒడ్డున పడ్డ చేపపిల్లలా, గిలగిలలాడే మనసుకి నిజం కావాలి.

ఆ రోజు రాత్రి పిచ్చివాడిలా కల్యాణి ఇంటికి బయల్దేరాను.

నిజం తేల్చుకోవాలి. కల్యాణి నిజంకక్కేదాకా తిరిగొచ్చేది లేదు, అనుకున్నాను.

పెరటి వీధిగుండా వెళ్ళి తలుపు తోశాను. చీకట్లో కొబ్బరిచెట్టు దెయ్యంలా నిల్చుంది. లోపలి తలుపులన్నీ వేసున్నాయి. కల్యాణి పడుకునుంటుందనుకుని, చేసేది లేక వెనక్కి తిరిగాను.

డాబామీద, చీకట్లో కల్యాణి ఆకారం కనిపించింది. పిట్టగోడ మెట్లగుండా డాబా ఎక్కాను.

'వెనకాతలి వేపు అద్దెకిచ్చాం. మెల్లిగా మాట్లాడండి. అమ్మావాళ్ళు ఇంకా పడుకోలేదు' అంది కల్యాణి.

నెలరోజులు అర్ధరాత్రి మంచులో నాకోసం కల్యాణి కళ్ళల్లో వొత్తులు పెట్టుకుని నిరీక్షిస్తోంది. లోపల్నించి ఉన్న మెట్లలోపన, కల్యాణి వాళ్ళు రావటానికి ఆస్కారం ఉంది.

గబగబా అడిగేశ్యాను. 'కల్యాణి! నీకూ, సాంబశివంకి ఉన్న సంబంధం నాకు పూర్తిగా తెలియాలి. అబద్ధం చెప్పటానికి ప్రయత్నించకు. నాకిప్పటికే సాంబశివం చాలా చెప్పాడు' — అని బొంకేను.

కల్యాణి వింతగా చూసింది.

'త్వరగా చెప్పు. ఏ క్షణాన్నయినా మీవాళ్ళు రావొచ్చు. ఈ క్షణం మనిద్దరి జీవితాలకి పరీక్షాసమయం' అన్నాను.


'ఆయన, రాణికి మేష్టారు. ఎక్కువ నారవ తీసుకోటానికి ప్రయత్నించేవారు. అమ్మతో చెప్పి మాన్పించేశాను. ఇప్పుడు ట్యూషన్‌కి రావటం లేదు' అంది.

'సాంబశివం నాకు చెప్పాడు. నువ్వు దాచిపెట్టి లాభంలేదు. నిజం కావాలి కల్యాణి!— నేను నిన్ను బెదిరించటం లేదు. అర్థిస్తున్నాను — ప్రాధేయపడుతున్నాను కల్యాణీ...'

నా మాట పూర్తికాలేదు.

కల్యాణి తల్లి లోపలి మెట్లగుండా తలుపు తీసుకొచ్చింది. నేను స్థాణువులా ఒక్క క్షణం ఉండిపోయాను. అంతవరకూ మా మధ్య వున్న రహస్యం ఆమెకు తెలీదు.

కల్యాణి నేల చూపులు చూస్తుంది—



# వల

'మీరు అనవసరంగా గొడవ చెయ్యకండి. నేనేం పొరపాటు చెయ్యలేదు' అని చెప్పి హఠాత్తుగా డాబామీంచి గెంతేశాను.

ఎందుకలా చేశానో చెప్పలేను. నన్ను పట్టుకుని అల్లరి చెయ్యటానికి వాళ్ళకి అవకాశం ఉందనిపించింది. అంతే!

నాకు బుర్ర పూర్తిగా చెడిపోయింది. రెండునెల్లు సెలవు పెట్టి ఇలా వొచ్చేశాను. ప్రతిక్షణం, సాంబశివం కళ్యాణి నా కళ్ళముందు కదిలి మనశ్శాంతిని తినేస్తున్నారు.

కళ్యాణిని నేను విడిచి పెట్టలేను.

ఆ దృశ్యాన్ని మర్చిపోలేను.

ఆ తుఫానుహోరు నుంచి తప్పించుకోవాలంటే, కళ్యాణిని చూడకుండా ఉండగలగాలంటే, ఎక్కడికో పారిపోవాలి.

సూట్‌కేస్‌లో రెండు బట్టలు కుక్కి, రెండొందలు అప్పుచేసి ఇలా బయల్దేరాను. మళ్ళీ వెనక్కి వెళ్తానో లేదో తెలీదు. నాకు మరి గమ్యం అంటూ లేదు. చదూకున్న ఊరిది. కాస్త మనశ్శాంతి దొరుకుతుందన్న భ్రమలో ఇక్కడికొచ్చాను. మీరంతా ఉన్నా, ఆలోచనలు వెంటాడి నన్ను పీక్కుతింటూనే ఉన్నాయ్.

నాలో తప్పు లేదనను. నేను మోసం చెయ్యలేదనను, కాని చివరికి కళ్యాణిని మనఃపూర్తిగా స్వీకరించాను మూర్తీ! —వాళ్ళు చేసిన దగా నన్ను దహించి వేస్తోంది.

నన్ను రౌడీ అను, లుచ్ఛా అను, దగాకోరను. కళ్యాణి నాకు జీవితాన్ని చూపించింది. కళ్యాణిని మనసారా నమ్మాను—చివరికి మోసపోయింది నేను. ఆ రోజు చూసిన దృశ్యం మరిచిపోలేను. సాంబశివం ఎంత మిత్రద్రోహి అయినా ఆమె ప్రోత్సాహం లేకుండా అంత చనువు తీసుకోడు. కళ్యాణి నాకు చేసిన అన్యాయాన్ని భరించలేను. ఆమె లేకుండా బ్రతకలేను. —ఇది ఎటూ తేలని సమస్య. నన్ను నిలువునా క్షణక్షణం కాల్చేస్తోంది. నువ్వు కథలు రాస్తావని తెల్సు. ఇది నువ్వు కథగా రాయాలి. దీనివల్ల నాకు కలిగే లాభం అంటూ లేదు, నిజమే! ఒప్పుకుంటాను. వాళ్ళ ద్రోహబుద్ధి వాళ్ళకు వెల్లడి కావాలి. వాళ్ళలో ఏకాస్త మానవత్వం ఉన్నా తప్పు తెలుసుకోవాలి. పశ్చాత్తాప పడాలి. నాకు జరిగిన అన్యాయం వాళ్ళకు తెలీదు. తల్చుకుంటే, ఇద్దర్నీ బజార్నపెట్టి శిక్ష వెయ్యగలను. ఒక హంతకుడికి ఉరిశిక్ష వెయ్యొచ్చు. కాని, అతను చేసిన ఘాతుకాన్ని, దుర్మార్గాన్ని, చూపించటానికి మనసుకు మరమ్మత్తు చేయాలి. హృదయం కరగాలి —కంటనీరు కాల్వగా కట్టాలి. అప్పుడు తను చేసిన తప్పు తెలిస్తే, గుండె పగిలి చస్తాడు. వేరే శిక్ష అనవసరం...

... జగన్, చివరిముక్కలు ఆవేశంగా చెప్పి, నుదుటను పట్టిన చెమటని రుమాలుతో తుడుచుకున్నాడు. సాయంత్రం అయిదింటికి మెట్లదగ్గర కూచున్నాం. వాచీ చూసుకున్నాను. రేడియం డయల్ ఎనిమిది చూపించింది.

చీకట్లో కనిపించటం లేదుగాని జగన్ మొహం ఎర్రగా కంది ఉంటుంది.

కథంతా విన్నాక ఎవరికయినా జగన్ మీద జాలేస్తుంది. నాకు కలిగినభావాన్ని మొహంలో పసిగట్టటం, పట్టపగలు కూడా సాధ్యంకాదు.

సాహసంతో, జీవితాన్ని, అందులో సుఖాల్ని దుఃఖాల్ని అనుభవించి, సుతిమెత్తని అనుభూతుల్ని శ్రుతిచేసి, సెలయేరులా, జలపాతంలా, అనుభవాల లోతుల్లో నిండుగా ప్రవహించే నదిలా, కాలమనే సాగరంలోకి, నింపాదిగా కదిలిపోయే మనిషి జగన్.

అందువల్ల నా కతనిమీద జాలి పడవల్సిన అవసరం కనపించలేదు.

నల్ల కళ్ళద్దాలుతీసి ఒకసారి తుడుచుకున్నాను. ఒంటరితనంలా చీకటి బిక్కు బిక్కు మంటోంది.

'చాలా చీకటి పడింది — నడుద్దాం జగన్' అన్నాను. దార్లో జగన్ చెప్పిన కథ గురించే ఆలోచిస్తున్నాను.

కళ్యాణిని పట్టటానికి వల విసిరింది జగన్. ఆ వేట వినోదం కోసం. అది శ్రుతి మించి రాగానపడి జగన్ ఎరగా మారేడు. సాంబశివం ఆ ఎరని పట్టుకుని కళ్యాణికి ఉచ్చులు బిగించాడు.

జగన్‌కి, కళ్యాణికి ఉన్న సంబంధం చాలావరకూ పోయిందని సాంబశివానికి తెలుసు. జగన్ కథనిబట్టి, సగం, జగన్ సాంబశివానికి చెప్పాడు. మిగిలింది, సాంబశివం పొంచివుండి గమనిస్తున్నాడు.

సాంబశివం తీసుకున్న చొరవ కళ్యాణి ఇచ్చింది కాదు. ఆమెకున్న అక్రమ సంబంధం అతనికిచ్చిన ధైర్యం అది.

కాని, సాంబశివం అంచనా తప్పిపోయింది. కళ్యాణి జగన్‌ని మనస్ఫూర్తిగానే ప్రేమించింది. అతనికి తన్ను అర్పణ చేసుకోటంలో తప్పు కనిపించలేదు. అది అలుసుగా తీసుకుని, సాంబశివం హద్దు మీరేదాకా తను తొందరపడిందని తెల్సుకోలేక పోయింది.

తన అంచనా తప్పిపోయాక జగన్ ముందు తప్పు ఒప్పుకోటానికి సాంబశివంకి ధైర్యం చాల్లేదు. దానిక్కారణం, అంతకుముందు అతనితో కుదిరిన మైత్రిలో స్వలాభాపేక్ష లేదు

జగన్ తను కళ్యాణిని ప్రేమిస్తున్నానని తెలుసుకునేముందు సాంబశివందగ్గర ఏమీ దాచలేదు. అతను చెప్పినదాంట్లో ఆమెను ఆకర్షిస్తున్నానన్న దర్పం ఉంది. —రెండోది, ఆమెపట్ల అతనికి ఏర్పడ్డ మోహం. కేవలం ఒక ఆడదాని మీదుండే కోరిక.

దాంతో సాంబశివం బుర్రలో దుర్బుద్ధి పుట్టింది. అప్పటికి జగన్ జాగ్రత్త పడ్డాడు. ఆమెపట్ల అనురాగం కలిగేక ఆ విషయం సాంబశివానికి దూరంగా ఉంచేడు.

నిజమాలోచిస్తే, జగన్ ప్రేమలో మొదటి నుంచి ఉదాత్తత లోపించింది. ముందు ఆమెతో చెలగాట మాడటం వినోదం కోసం. తర్వాత, మోహాన్ని చల్లార్చుకోటం కోసం. అతనికి కళ్యాణిపట్ల ఉంది ప్రేమ అనటంకన్నా, కృతజ్ఞత అనటం బావుంటుంది. ఆమెలోని స్నిగ్ధత నిర్మల అంతఃకరణ, అతనిలో కృతజ్ఞత నింపింది.

జగన్ ఆమెను ప్రేమించి ఉంటే, అతనికి సమస్య అంటూ లేదు. అతనికి తెలీకుండానే ఆమెను వొదుల్చుకోవాలన్న కాంక్ష అంతర్గతంగా ఉంది. దానికి బలమైన కారణం కావాలి. అది వచ్చినిజంలా

కనిపించాలి.

దానికి మళ్ళా సాంబశివమే ఆధారం అయ్యాడు కాని, ఆ నిజం నే చెబితే జగన్ భరించలేడు. తాత్కాలికంగా బాధపడుతూ ఆనను పొందే ఉపశాంతికూడా, దూరమవుతుంది.

కాలం ఏలాంటి గాయాన్నయినా నయంచేస్తుంది. జగన్ ఆమెను ప్రేమించలేదు. పెళ్ళి చేసుకోలేదు. జగన్ చాలా దురదృష్ట జాతకుడు. కల్యాణిలాంటి పిల్ల నా జీవితంలో తారసపడితే, ఆమె కోసం సర్వస్వం ధారపోసేవాణ్ణి. ఆమె వ్యక్తిత్వంముందు జగన్, సాంబశివాలు మిణుగురులు.

సాంబశివం పుర్రెలోపుట్టిన బుద్ధి



ఇంకా అడ్డదోవల తొక్కుతుంది. కారణం లేకుండానే, ఆమెమీద పగతీర్చుకోవాలన్న కాంక్ష బలీయమవుతుంది. ఆమె చరిత్రను, వీధిలోకి ఈడ్చక మానడు.

చివరికి వలలో చిక్కుకుని గిలగిలలాడేది కల్యాణి.

నేను అనుకున్నట్టుగానే జగన్ చెప్పింది చాలా మామూలు ప్రేమకథ.

ఒక గుడ్డిపిల్లని, అనాకారిని ప్రేమించిన కథానాయకుడు హృదయాన్ని సాక్షిగా తీసుకొన్నా, ఆ ప్రేమ కథని స్వీకరించటానికి నాకు అభ్యంతరంలేదు.




నా ప్రేమకథలకి కొలతలు వేరు. నే ప్రేమిద్దామనుకున్న ఏ అమ్మాయీ నా కోసం కల్యాణిలా వొత్తులు పెట్టుకు చూడలేదు. కనీసం క్రీగంట వీక్షించలేదు.

అందుకని వాళ్ళని తప్పుపట్టటం నా కిష్టం లేదు. నా దురదృష్టానికి చింతించను.

నా కలానికి ప్రేమకథలు అతకవు. నా మనసుకి నామొహం అతకనట్టు.

ఆడపిల్లని ప్రేమించటం అనేది, నాకు చేతయినట్టుగా ఏ మొగాడికీ కాదని నా గుడ్డి నమ్మకం.

జగన్ ఇంకో రెండ్రోజులుండి వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు 'జగన్! కల్యాణి అడ్రస్ నాకియ్యి ఈ కథకి ముగింపు ఇవ్వటానికి, ఆమె నొక్కసారి చూడాలి' అన్నాను.

జగన్ వెళ్ళిన నెల్రోజులకి అతని పెళ్ళి శుభలేఖ నాకు అందింది.

పెళ్ళికూతురు కల్యాణి, రేరాణి, డైమాన్‌రాణి కాదు వెంకట సుబ్బలక్ష్మి.

పెళ్ళికి వెళ్ళొచ్చిన మిత్రులు చెప్పారు—మంగళ సూత్రం కట్టేదాకా జగన్ దేవదాసులా ఉన్నాడు. అమ్మాయి కుందనపు బొమ్మలా ఉంది. పెళ్ళి జరిగిన మర్నాటినుంచి జగన్ ఆమెను అమితంగా ప్రేమిస్తున్నాట్ట.

నా రెండో జోస్యంకూడా నిజమైంది. సాంబశివం, కల్యాణిని అల్లరిపాలు చేశాడు. డప్పు తగలించుకుని, ఊరూరా తిరిగి, ఆమె కళంకాన్ని కీర్తించాడు.

కల్యాణికి పెళ్ళి కాలేదు.

వలలోపడింది ఎవరో కాదు, కల్యాణి—గుండెలమీద కుంపటి—రిటైర్డ్ పోలీసాఫీసర్ కూతురు, కల్యాణి తిలకం.

ఆమెను వలవేసి పట్టింది జగన్‌కాదు సాంబశివం కాదు. మీకు చెబుతోన్న కథకుడు.

ఇప్పుడామె కల్యాణిమూర్తి.

ప్రేమంటే నాకు గొప్ప ఎలర్జీ. మా కల్యాణికూడా అదంతా ఉత్త 'ట్రాష్' అంటుంది. కల్యాణిని చేసుకున్నాక రాత్రిపూట చలవ కళ్ళద్దాలు పెట్టుకోటం మానేశాను.

ఇప్పుడు నన్నూ, నా గాజుకంటినీ కూడా కల్యాణి ప్రేమిస్తుంది.